క్లుప్తంగా

ప్రతీ వాహనం తనిఖీ

ఎన్నికల పరిశీలకుడు మునీష్ రజని



మేకవనంపల్లిలో చెక్‌పోస్టును పరిశీలించిన మునీష్ రజని

మోమిన్‌పేట: ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని ఎన్నికల పరిశీలకుడు మునీష్ రజని పేర్కొన్నారు. శనివారం మండలంలోని మేకవనంపల్లిలో ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్టును ఆయన సందర్శించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా చెక్‌పోస్టుల వద్ద నిఘా నిరంతరం అవసరమన్నారు. ప్రతి వాహనం తనిఖీ చేయాలని సూచించారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు కావాల్సిన అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట డీఎస్పీ నర్సింలు, సీఐ అంజనేయులు, ఎస్ఐ విఠల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌కు సర్పంచ్ రాజీనామా

అదేబాటలో పార్టీ సీనియర్ నేత రాంరెడ్డి



రాజీనామా చేస్తున్నట్లు ప్రకటిస్తున్న రాంరెడ్డి

ధారూరు: మండలం పరిధిలోని మున్నూరుసోమారం గ్రామ సర్పంచ్ అనుష శనివారం బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. ఆమెతో పాటు తెలంగాణ ఉద్యమకారుడు, సీనియర్ బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు రాంరెడ్డి సైతం పార్టీకి గుడ్‌బై చెప్పారు. రాజీనామా పత్రాన్ని జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌కు పంపించారు. గతంలో రాంరెడ్డి మండల రైతుబంధు అధ్యక్షుడిగా సేవలందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఎమ్మెల్యే ఆనంద్ పార్టీలో తనకు సరైన ప్రాధాన్యం ఇవ్వకపోవడం, కక్ష సాధింపులకు పాల్పడుతుండడంతో పార్టీని వీడుతున్నట్లు ఆయన ఆరోపించారు. అనంతరం ఆదివారం కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ఆయన తెలిపారు.

వైభవంగా తిరుమల నాథస్వామి ఉత్సవాలు



రథాన్ని ఊరేగిస్తున్న భక్తులు

పూడూరు: మండలంలోని పెద్ద ఉమ్మెంతాల్ గ్రామంలో కొలువుదీరిన తిరుమల నాథస్వామి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. శనివారం తెల్లవారు జామున స్వామివారి రథోత్సవం కనుల పండువగా సాగింది. గ్రామమంతా తిరుమల నాథుని సంకీర్తనలు, ఓం నమః శివాయ నామ స్మరణతో మార్మోగింది. అనంతరం స్వామివారి ఏకాంతసేవ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భజన మండలి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సంకీర్తనలు, అఖండ భజనలు చేశారు. ఈ సందర్భంగా వికారాబాద్ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో రాకంచర్ల వెంకటదాసు జీవితం-సంకీర్తనా సాహిత్యం అనే అంశంపై సాహితీ సదస్సు నిర్వహించారు. జాతరకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. కార్యక్రమంలో కవి, రచయిత దోరవేటి చెన్నయ్య, రాజు, శతావధాని మలుగ అంజయ్య, సర్పంచ్ శ్రీధర్, ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్త, ప్రభాకర్‌గుప్త పాల్గొన్నారు.

వృత్తి విద్యాకోర్సులతో లబ్ధి



యువతీ యువకులకు సూచనలు చేస్తున్న ఎంఈఓ

కుల్కచర్ల: విద్యార్థులకు టెక్నికల్‌పరంగా ఉచితంగా అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర ఇంటర్, డిగ్రీ కళాశాలలో ఉచిత కంప్యూటర్ శిక్షణ, టైలరింగ్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతకు వృత్తివిద్యాకోర్సులను అందించాలన్న సంకల్పంతో ఉచిత కంప్యూటర్ శిక్షణ, టైలరింగ్ కోర్సులను ప్రారంభించడం జరిగిందన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కామేశ్వరి, జెడ్పీ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంజుల, కుల్కచర్ల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అపర్ణ, అధ్యాపక సిబ్బంది కృష్ణయ్య, వెంకటేశ్వర రెడ్డి, గోపాల్, సాయి భరత్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యువతే నాబలం

- వెన్నంటి నడిచిన వారిని మరిచిపోను
- స్థానిక సంస్థల్లో 40 శాతం ప్రాధాన్యం
- యువగర్జన సభలో ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి



తాండూర్ టౌన్: యువగర్జనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



కొడంగల్ రూరల్: ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

తాండూర్ టౌన్ : వెన్నంటి నడిచిన యువతను మరిచిపోలేనని, యువతే నాబలమని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పైలట్ రోహిత్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక విలయం మూన్ మైదానంలో యువగర్జన సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు నియోజకవర్గంలోని నలుమూలల నుంచి యువత పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 15 ఏళ్ల క్రితం నేను ఒంటరిగా ఉన్నప్పుడు నా వెంట నడిచింది యువతేనన్నారు. యంగ్ లీడర్స్ సంస్థ ద్వారా యువత రాజకీయాల్లోకి రావాలనే నినాదంతో ముందుకు సాగామన్నారు. ఎన్ని దాడులు జరిగినా, కేసులు పెట్టినా మొండిగా నాతో కలిసి నడిచిన యువతను జీవితంలో మరవలేనన్నారు. అందుకే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు 40 శాతం ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. నా పిలుపు మేరకు యువత రాజకీయాల్లోకి వచ్చి సర్పంచులు, ఎంపీటీసీలు అయ్యారన్నారు. సీఎం కేసీఆర్ అనేక పరిశ్రమల ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించారని అన్నారు. రూ. 1680 కోట్ల నిధులు మంజూరు చేసి తాండూరు రూపురేఖలను మార్చారని తెలిపారు. మంత్రి మహేందర్‌రెడ్డి సహకారం, మీ తోడ్పాటుతో రాబోయే ఎన్నికల్లో రెండోసారి గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. బయట నుంచి వచ్చిన వ్యక్తులు ఓట్లు అడుగుతున్నారని, ఎంతైనా ఇంటోడు ఇంటోడే, బయటోడు బయటోడే అని ఎద్దేవా చేశారు. అనంతరం మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. నా తోడ్పాటుతో పాటు యువత తోడుంటే రోహిత్‌రెడ్డి గెలుపు సునాయాసమన్నారు. తప్పకుండా రాబోయే ఎన్నికల్లో భారీ మెజార్టీతో రోహిత్‌రెడ్డిని గెలిపిస్తామని తెలిపారు. అనంతరం బీసీ సంఘం ఆర్ కృష్ణయ్య తనయుడు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. తాండూరులో యువ ప్రభంజనాన్ని చూస్తున్నానని, యువత రాజకీయాల్లోకి రావాలని చెప్పడం కాకుండా , రోహిత్‌రెడ్డి ఎమ్మెల్యే అయి అందరికీ ఆదర్శంగా నిలిచాడన్నారు. కార్యక్రమంలో యువనాయకులు అనిల్‌బాండ్, మెహబూబ్, సంగమేశ్వర్, సుధాకర్ గౌడ్, డేవిడ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

తాండూరు రూరల్: మండల పరిధిలోని ఖాంజాపూర్‌లో శనివారం గ్రామ సర్పంచ్ లలిత ఆధ్వర్యంలో వందమంది బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. మరోసారి గెలిపిస్తే అందుబాటులో ఉండి తాండూరును మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ఖాంజాపూర్ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. మాజీ సర్పంచ్ నర్సింలు, ఉప సర్పంచ్ వెంకటప్ప, నాయకులు నర్సింలు, భారతమ్మతో పాటు పెద్ద ఎత్తున మహిళలు, యువకులకు ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే, జినుగుర్తి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఇంజనీర్ అనంతయ్య ఎమ్మెల్యే సతీమణి ఆర్తిరెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం

కొడంగల్ రూరల్ : కొడంగల్ మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో శనివారం ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. పార్టీ మేనిఫెస్టోను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు,యువకులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథతో తాగు నీటి కష్టాలకు చెక్

మర్పల్లి: ఉమ్మడి రాష్ట్రంలో గ్రామాల్లో తాగునీటి కోసం ముష్టియుద్ధాలు, ఖాళీ బిందెలతో నిరసనలు తెలుపుతూ ప్రజాప్రతినిధులకు స్వాగతం పలికే వారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మెతుకు ఆనంద్ పేర్కొన్నారు. నేడు సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ పథకంతో గ్రామాల్లో తాగునీటి కష్టాలు తీర్చారని చెప్పారు. బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారానికి వెళ్తుంటే ఎమ్మెల్యేలపై పూలవర్షం కురిపిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని నర్సాపూర్, గుండ్ల మర్పల్లి, పిల్లిగుండ్ల గ్రామాల్లో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ లలిత రమేష్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌గుప్తాతో కలిసి ఎమ్మెల్యే ఆనంద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. నియోజకవర్గంలో ఏ మండలానికి చేయని అభివృద్ధి మర్పల్లికి చేశారని స్పష్టం చేశారు. ప్రస్తుతం జరగనున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల చైర్మన్ మల్లేశం, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పుష్ప, శివకుమార్, పాండు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

సబ్బండవర్గాలకు అండగా బీఆర్‌ఎస్

కుల్కచర్ల: బీఆర్‌ఎస్ పాలనలో పేదలకు అన్ని మౌలిక సదుపాయాలను కల్పించామని జెడ్పీటీసీ రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. శనివారం చౌడాపూర్ మండలంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సబ్బండ వర్గాల ప్రజల ఉన్నతికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ చౌడపూర్ మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ నాగరాజు, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్, మండల ఉపాధ్యక్షుడు రాజశేకర్, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, నర్సింలు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.



తాండూరు రూరల్: ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన గ్రామస్తులు



మర్పల్లి: ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

బీఎస్పీలో పలువురి చేరిక



బీఎస్పీలో చేరిన ప్రభుకుమార్

పెద్దేముల్: బీఎస్పీతోనే పేదలకు అన్ని విధాల న్యాయం జరుగుతుందని బీఎస్పీ తాండూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చంద్రశేఖర్ ముదిరాజ్ అన్నారు. శనివారం పెద్దేముల్ మండల తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ డైరెక్టర్ ప్రభుకుమార్‌తో పాటు పలువురు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో బీఎస్పీలో ఇతర పార్టీల కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున చేరుతున్నారని తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం



మద్యం బాటిళ్లను చూపుతున్న ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి

మర్పల్లి: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో బెల్టు షాపుల్లో మద్యం విక్రయిస్తున్న షాపులపై దాడులు చేసి ఇప్పటి వరకు 12 కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపాడు. శనివారం ఆయన మర్పల్లి పీఎస్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎన్నికల కోడ్ వచ్చిన నాటి నుంచి అక్రమ మద్యం విక్రయించే స్థావరాలపై దాడులు చేసి 130 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపాడు. మండల పరిధిలోని కొత్లాపూర్ గ్రామంలో ఓ కిరాణ్ షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపాడు.

‘ధరణి’ పేరుతో ప్రభుత్వం దగా

మాజీమంత్రి కూతురు అనన్య, పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి



ప్రచారంలో పాల్గొన్న అనన్య, రఘువీరారెడ్డి

ధారూరు: ధరణి పేరుతో రైతులను దగా చేసిన ప్రభుత్వాన్ని పాతరేయాలని మాజీమంత్రి కూతురు అనన్య, పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పార్టీ నాయకులతో కలిసి మండలంలోని రాంపూర్‌తండా, గట్టెపల్లి, రుద్రారం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ్‌ముఖ్‌లు, దొరలు, నవాబులకు చెందిన భూములకు వారసులు లేరని తెలుసుకొని వారి భూములను లాక్కున్నారు. వేల కోట్లకు కంపెనీలు, నేతలు, వ్యాపారుల పేర్లపై రిజిస్ట్రేషన్లు చేయించారని ఆరోపించారు. మండలంలోని ఆరంపూర్‌తండా, బూర్గుగడ్డ భూములను ఇతరులకు విక్రయించి, రిజిస్ట్రేషన్లు చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ధరణి పేర దోచుకున్న భూములను వెనక్కి తీసుకుని రైతులకు ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పటోళ్ల రాములు, రాంపూర్‌తండా, ధర్మాపూర్ సర్పంచులు పాండునాయక్, అనిల్, ఎంపీటీసీలు బసప్ప, శ్రీనివాస్‌లు, కాంగ్రెస్ నాయకులు మహ్మ బాబాఖాన్, అవినాశ్‌రెడ్డి, అశోక్, ఇబ్రాహిం, మల్లారెడ్డి, బుజ్జయ్యగౌడ్ పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు పోరాటం

జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న యూటీఎఫ్ సంఘం సభ్యులు

కొడంగల్ రూరల్ : ఉపాధ్యాయుల డిమాండ్ల సాధనకు, పోరాటాలు చేసేందుకు తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్ యూటీఎఫ్) ముందుంటుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం అన్నారు. శనివారం మండలంలోని ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల, కస్తూర్బా గాంధీ పాఠశాల, హుస్నాబాద్‌లోని జెడ్పీహెచ్‌ఎస్, జీపీఎస్, పల్లుగురాళ్లతండా, యూపీఎస్ నర్సాపూర్ పాఠశాలల్లో టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దౌల్తాబాద్ జెడ్పీహెచ్‌ఎస్‌లోని నర్సిములు, పీఎస్ పెద్దనందిగామలోని రాజారత్నంలు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం ఆధ్వర్యంలో సభ్యత్వం తీసుకున్నారని సభ్యులు తెలిపారు. అనతరం సంఘంలో చేరిన సభ్యులకు పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు బసప్ప, ప్రధాన కార్యదర్శి అశోక్, సీనియర్ సభ్యులు ముత్యప్ప, ఆంజనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

పోలీసు స్టేషన్ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి



సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ చంద్రశేఖర్‌రెడ్డి

బొంరాస్‌పేట: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా పోలీసులు అప్రమత్తం ఉండాలని జిల్లా మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా జిల్లా ఎస్పీ కోటిరెడ్డి ఉత్తర్వుల మేరకు సీఐ శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ ఇన్‌చార్జిగా ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ శంకర్‌నాయక్, సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండి శాంతిభద్రతలు కాపాడాలన్నారు.

ఎంపీ రంజిత్‌రెడ్డిపై ఆరోపణలు సహించం

వికారాబాద్ అర్బన్: చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరాధారమైన అవినీతి ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బి. కృష్ణయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంతో మంచి మనస్సు ఉన్న, అవినీతి మచ్చలేని రంజిత్ రెడ్డిని విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పార్టీలకు అతీతంగా ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి సహాయం చేసే గుణం ఎంపీదని తెలిపారు. అలాంటి నాయకుడిపై కాంగ్రెస్ పార్టీ అవినీతి ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. ఎవరు ఎన్ని ఆరోపణలు చేసినా బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆనంద్ గెలుపు కోసం ఎంపీ కృషి చేస్తారని అన్నారు.

తాండూరు గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌రెడ్డి



దౌల్తాబాద్: కాంగ్రెస్ పార్టీలో చేరిన మహిళలు

పెద్దేముల్: తాండూరు గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని మంబాపూర్, కందనెల్లి గ్రామాల్లో మండల బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, మండల పరిషత్ మాజీ అధ్యక్షురాలు వాణిశ్రీ, కందనెల్లి మాజీ సర్పంచ్ లక్ష్మితో పాటు మంబాపూర్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి మనోహర్‌రెడ్డి కండువాలు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. మళ్లీ ఇందిరమ్మ రాజ్యం, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సంక్షేమ పాలనను తీసుకొస్తామని ధీమా వ్యక్తం చేశారు. మరోసారి మోసం చేసి ఓట్లు కొనేందుకు వస్తున్న బీఆర్‌ఎస్ నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్యారంటీ పథకాలను అభివృద్ధి చేస్తామన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని వికారాబాద్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్ , మండల పార్టీ అధ్యక్షుడు గోపాల్, మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, గోపాల్‌రెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షుడు నర్సింలు, జిల్లా మహిళ అధ్యక్షురాలు శోభరాణి, మైనార్టీ సెల్ కన్వీనర్ రియాజ్, మండల సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రామ్మోహన్‌రెడ్డిని గెలిపించండి

పూడూరు: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి పరిగి కాంగ్రెస్ అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డిని గెలిపించాలని ఆయన సతీమణి ఉమారెడ్డి అభ్యర్థించారు. శనివారం మండల పరిధిలోని తుర్క ఎన్కేపల్లిలో పార్టీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే బలహీన వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. అధికారంలోకి రాగానే ప్రతి ఇంటికి ఆరు గ్యారంటీలను అందజేస్తామన్నారు. అన్ని వర్గాలను సమానంగా చూసిన ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని కొనియాడారు. బీఆర్‌ఎస్‌లో అడుగడుగునా అన్యాయం జరిగిందని, కాంగ్రెస్ వస్తేనే మన బతుకులు బాగుపడతాయని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శులు శ్రీనివాస్, పెంటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సురేందర్, ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

ప్రసాద్‌కుమార్ గెలిస్తేనే అభివృద్ధి

వికారాబాద్ అర్బన్: కాంగ్రెస్‌కు ఓటు వేసి ప్రసాద్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు అర్థ సుధాకర్ రెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని 29వ వార్డు కన్యలాల్ బాగ్‌లో గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, సీనియర్ నాయకులు మధుకర్, నరోత్తం రెడ్డి, గుడిసె లక్ష్మన్, రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

బషీరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాబోతోందని ఆ పార్టీ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం బషీరాబాద్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు భారీగా కాంగ్రెస్ పార్టీలో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. ఆ పార్టీ అభ్యర్థిని ఓడించడానికి తాండూరు ఓటర్లు కసిగా ఎదురు చూస్తున్నారని తెలిపారు. కార్యకర్తలు ఆరు గ్యారంటీలు ఇంటింటికి ప్రచారం చేయాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే నారాయణరావు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కల్వ సుజాత, మాజీ జెడ్పీటీసీ రాకేష్, వెంకటేష్ మహరాజ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

దౌల్తాబాద్: మండలంలోని మామిడికుంట, చంద్రకల్, బాలంపేట గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు శనివారం నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. 30న జరిగే శాసనసభ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటేసి రేవంత్ రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరావు, వెంకట్‌రెడ్డి, వెంకటప్ప, సత్యపాల్, మాధవరెడ్డి తదితరులున్నారు.

అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తా

బంట్వారం: తనను ఒక్కసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని తాండూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం తాండూరు నియోజకవర్గంలోని కోట్‌పల్లి, అన్నాసాగర్, బుగ్గాపూర్ తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్‌ను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదల బతుకులు బాగుపడతాయన్నారు. తనను ఆదరించి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే తాండూరు నియోజకవర్గ రూపురేఖలు మారుస్తానని తెలిపారు. కార్యక్రమంలో పెద్దేముల్ జెడ్పీటీసీ ధారాసింగ్, పీసీసీ అధికార ప్రతినిధి కల్వ సుజాత, మాజీ జెడ్పీటీసీ అంజయ్య, నాయకులు జ్ఞానేశ్వర్, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రానున్నది ఇందిరమ్మ రాజ్యమే

కుల్కచర్ల: రాష్ట్రంలో రానున్నది ఇందిరమ్మ రాజ్యమేనని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, ఆ పార్టీ మండల అధ్యక్షుడు అంజనేయులు అన్నారు. శనివారం మండల పరిధిలోని తిర్మలాపూర్, కుస్మసముద్రం, చెరువుముందలి తండాల్లో పార్టీ నేతలు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల అభ్యున్నతికి కృషి చేసేది ఒక్క కాంగ్రెస్ పార్టీయేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మాజీ ఎంపీపీ అంజిలయ్య, కృష్ణయ్య, బాబు, మురళి, బాను, మొగులయ్య, స్వామి, ఉమాశంకర్, బాలకృష్ణ, వెంకటయ్య పాల్గొన్నారు.



బంట్వారం: ప్రచారంలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి



కుల్కచర్ల: ప్రచారాన్ని నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు